సాక్షి
జనగామ
శుక్రవారం । 7 । ఫిబ్రవరి । 2025



30 రైళ్ల రద్దు.. 9 మళ్లింపు

కాజీపేట–విజయవాడ మధ్య నాన్ ఇంటర్ లాకింగ్ వర్క్స్ బ్లాక్‌తో కాజీపేట, వరంగల్ మీదుగా వెళ్లే పలు రైళ్లు రద్దయ్యాయి. - 8లో▸



సోలార్ సొబగులు

పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' పథకంలో భాగంగా జిల్లాకు ఒక మోడల్ సోలార్ విలేజ్‌ని ఎంపిక చేశారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
35°/20°

వాతావరణం

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోత అధికమవుతుంది. రాత్రి పూట చలి తీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన ఎస్సీ సెల్ బాధ్యులు



జనగామ: ఉభయ సభల్లో ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపిన సందర్భంగా రాష్ట్ర ఎస్సీసెల్ జాయింట్ కన్వీనర్ మిద్దెపాక సిద్దులు గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతోపాటు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం ముఖ్యమంత్రికి పుష్ప గుచ్ఛం అందజేసి సత్కరించారు.

ఫుట్‌పాత్‌ల తొలగింపు



జనగామ: పట్టణంలో నెహ్రూపార్కు నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఆక్రమించిన ఫుట్‌పాత్‌లను గురువారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు పురపాలిక స్పెషల్ ఆఫీసర్ పులి శేఖర్ ఆధ్వర్యాన తొలగించారు. డ్రెయినేజీ, రోడ్లను ఆక్రమించి ఫుట్‌పాత్ వ్యాపారాలు చేస్తున్న వారిని హెచ్చరించడంతో పాటు సామగ్రిని తరలించారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు సాంకేతిక నిపుణుడిగా 'గంగిశెట్టి'



జనగామ: డెహ్రాడూన్‌లో ఈనెల 7వ తేదీ నుంచి జరిగే జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు సాంకేతిక నిపుణుడిగా జనగామ మండలం చౌడారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు గంగిశెట్టి మనోజ్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణగౌడ్, కోశాధికారి ఆవుల అశోక్, సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, రంజిత్‌కుమార్, సురేష్, ప్రవీణ్, శ్రీదేవి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపగోని సుగుణాకర్, హనుమంతరావు, తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కొండా రవి తదితరులు మనోజ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు 45 మంది గైర్హాజరు

జనగామ రూరల్: జిల్లాలో గురువారం నిర్వహించిన ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు 45 మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ కె.జితేందర్ రెడ్డి తెలిపారు. మొదటి సెషన్‌లో జనరల్, ఒకేషనల్ 496 మంది విద్యార్థులకు 470, రెండవ సెషన్‌లో జనరల్, ఒకేషనల్ 491 మందికి 472 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. జనగామలోని పలు పరీక్ష కేంద్రాలను డీఈఐఓ, పాలకుర్తి, కొడకండ్ల కేంద్రాలను డెక్ సభ్యులు, నర్మెట, స్టేషన్‌ఘన్‌పూర్ సెంటర్లను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సందర్శించినట్లు వివరించారు.

సహాయ పరికరాలకు 230 దరఖాస్తులు



జనగామ రూరల్: అలింకో హైదరాబాద్ సంస్థ సహకారంతో దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ పరికరాల ఎంపికకు నిర్వహించిన శిబిరాలు ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి 230 దరఖాస్తులు స్వీకరించినట్లు జిల్లా సంక్షేమ అధికారి ఫ్లోరెన్స్ తెలిపారు. కలెక్టరేట్‌లోని శిబిరానికి గురువారం జనగామ రూరల్, మున్సిపాలిటీ, లింగాలఘణపురం, తరిగొప్పుల, నర్మెట, బచ్చన్నపేట మండలాలకు సంబంధించి 80 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అలింకో కంపెనీ అధికారులు రష్మి, రంజన్ శెట్టి, రాజబాబు, అభిషేక్, అఖిలేష్, సీడీపీఓ రమాదేవి, సీనియర్ అసిస్టెంట్ సంపత్‌కుమార్, ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి రాజు, సదానందం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలి

జనగామ రూరల్: పట్టణంలోని హైదరాబాద్ బైపాస్ రోడ్డు మీదుగా అండర్ పాస్ బ్రిడ్జి తప్పనిసరి నిర్మించాలి.. ఇందుకు కలెక్టర్ రిజ్వాన్ బాషా కృషి చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బొట్ల శేఖర్ కోరారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యాన జిల్లా కేంద్రంలో చేపట్టిన దీక్షలు గురువారం కొనసాగాయి. ఈ కార్యక్రమంలో బూడిద ప్రశాంత్, తోటి దేవదానం, మబ్బు ఉప్పలయ్య, యాదగిరి, లక్ష్మి, అంజయ్య, మల్లేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు భరోసా..

రైతన్నల అకౌంట్లలో 'రైతు భరోసా' పైకం

- యాసంగి పెట్టుబడి సాయం రూ.15.87కోట్లు
- పథకానికి అర్హులైన రైతులు 1.96 లక్షల మంది
- అనర్హత కింద జిల్లాలో 7వేల ఎకరాల భూమి తొలగింపు



జనగామ : అన్నదాతలకు ఏడాదికి రెండు సీజన్లలో ఎకరానికి రూ.6వేల చొప్పున రూ.12వేల పెట్టుబడి సాయం అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు 'రైతు భరోసా' పథకం అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం యాసంగి పెట్టుబడి కోసం జిల్లాలో ఇప్పటి వరకు ఎకరం నుంచి రెండు ఎకరాలలోపు వ్యవసాయ భూమి ఉన్న 12,292 మంది రైతుల ఖాతాల్లో రూ.15.87 కోట్లు జమ చేయాల్సి ఉండగా రెండు రోజుల క్రితం ప్రక్రియ ప్రారంభమైంది.

అర్హులు 1.96లక్షల మంది రైతులు..

జిల్లాలో 3.50లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా.. వానాకాలం 3.20 లక్షల ఎకరాలు, యాసంగిలో 2లక్షల ఎకరాల వరకు సాగవుతున్నది. 2023–24 యాసంగి సీజన్‌లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 1,89,236 మంది రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.206.82కోట్లు అందించింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వానాకాలం సీజన్ నుంచి రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామని చెప్పినప్పటికీ.. గత ప్రభుత్వం గుట్టలు, చెట్లు, కమర్షిల్ భూములకు సైతం పెట్టుబడి సాయం అందించిందనే ఆరోపణల నేపథ్యంలో భూసర్వే చేపట్టింది. అనర్హత జాబితాలో ఉన్న భూవివరాలను తొలగించడంతో ఆలస్యం జరిగింది. దీంతో ప్రధాన ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీ పెట్టుబడి సాయం విషయమై రైతుల పక్షాన నిలబడి ఆందోళనలకు దిగడం.. రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిన నేపథ్యంలో పెట్టుబడి సాయం విడుదల చేసింది.

7,010 ఎకరాలు తొలగింపు

'రైతు భరోసా' పథకం అమలుకు ముందు జిల్లాలో సాగుకు యోగ్యమైన భూమిని సర్వే చేసింది. ఇందులో 7,010 ఎకరాల భూమి అనర్హత కింద గుర్తించి జాబితా నుంచి తొలగించారు. అందులో కోళ్లఫాంలు, పెట్రోలు బంకులు, గుట్టలు, ఫంక్షన్ హాళ్లు, ఇతర కమర్షియల్ నిర్మాణాలు ఉన్నట్లు సర్వేలో గుర్తించిన అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. తుది నివేదిక ద్వారా రైతు భరోసా పథకానికి జిల్లాలో 1,96,360 మంది రైతులు అర్హులుగా ఉన్నట్లు ప్రకటించారు. ఎకరం నుంచి రెండెకరాల లోపు వ్యవసాయ భూమి ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి.

రూ.12వేలు జమయ్యాయి..



నాకు రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. వానాకాలంలో పెట్టుబడి సాయం వస్తుందని ఎదురు చూసిన. యాసంగికి అందింది. ప్రభుత్వం రూ.12వేలు అకౌంట్‌లో జమ చేసింది. చాలా సంతోషంగా ఉంది. కలుపు తీత, ఇతర వ్యవసాయ పనులకు ఉపయోగపడతాయి.

- గంధం చంద్రమౌళి, రైతు, వడ్డెగూడెం(జఫర్‌గఢ్)

రూ.1,500 వచ్చాయి



నాకు పది గుంటల భూమి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు ఉన్న భూమి మేరకు రూ.1,500 'రైతు భరోసా' సాయం జమ చేసింది. పొలంలో కలుపు తీయిస్తాన.

- తేలుకంటి అంజయ్య, రైతు, బచ్చన్నపేట

మండలాల వారీగా యాసంగి 'రైతు భరోసా' వివరాలు

మండలం	రైతులు	మొత్తం
చిల్పూరు	858	రూ:1.38కోట్లు
స్టేషన్‌ఘన్‌పూర్	753	రూ:90.07లక్షలు
లింగాలఘణపురం	485	రూ:82.01లక్షలు
రఘునాథపల్లి	525	రూ:60.76లక్షలు
జఫర్‌గఢ్	2,785	రూ:2.98 కోట్లు
బచ్చన్నపేట	808	రూ:1.11కోట్లు
జనగామ	1,383	రూ:2.20కోట్లు
నర్మెట	473	రూ:59.90లక్షలు
తరిగొప్పుల	1,320	రూ:1.51కోట్లు
దేవరుప్పుల	1,266	రూ:1.71కోట్లు
కొడకండ్ల	1,301	రూ:1.61కోట్లు
పాలకుర్తి	335	రూ:42.11లక్షలు

విద్యుత్ కాంతులతో జిగేల్‌మంటున్న కాళేశ్వరాలయం



మహాకుంభాభిషేకానికి వేళాయె..

- నేటి నుంచి మూడురోజుల పాటు కార్యక్రమం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో నేటి(శుక్రవారం) నుంచి మూడురోజుల పాటు మహాకుంభాభిషేకం జరగనుంది. ఈమేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం రాత్రి విద్యుత్ దీపాలతో ఆలయాన్ని ముస్తాబు చేశారు. - కాళేశ్వరం - వివరాలు 8లో▸

సర్కారు స్కూళ్లకు వంట సామగ్రి

- 337 పాఠశాలలకు రూ.44.15 లక్షలు విడుదల
- ఈనెల 10వ తేదీ నుంచి పంపిణీ

జనగామ: ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రధాన మంత్రి పోషణ్(మధ్యాహ్నం భోజన పథకం) ద్వారా వంట గదిలో అవసరమయ్యే సామగ్రి సరఫరాకు గాను జిల్లాల వారీగా టెండర్లు పూర్తి చేసింది. నల్లగొండకు చెందిన రేఖ జనరల్ స్టోర్ సామగ్రి సరఫరా హక్కు దక్కించుకుంది. ఇందుకు సంబంధించి 337 ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత తదితర పాఠశాలలకు రూ.44.15లక్షల నిధులను విడుదల చేసింది. జిల్లాలోని ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలలకు ఈనెల10వ తేదీ నుంచి వంట సామగ్రి పంపిణీ చేయనున్నారు. గ్యాస్‌స్టౌవ్, 10, 30, 40, 50 కిలోల బియ్యం సామర్థ్యం కలిగిన బగోనా, కూర, 5, 10, 15, 20, 25 కిలోల సామర్థ్యం కలిగిన సాంబారు గిన్నెలతోపాటు బేసిన్లు, స్టీల్ కంటైనర్లు, స్టీల్ బకెట్లు, స్టీల్ స్పూన్లను 50 నుంచి 51–150, 151–250, 251 మందికిపైన విద్యార్థులున్న పాఠశాలలకు అందించనున్నారు. వీటిని ఆయా పాఠశాలల హెచ్‌ఎంల సమక్షంలో డెలివరీ చేయనున్నారు. సామగ్రిని స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. సామగ్రి తీసుకునే సమయంలో ఏమైనా పాడైపోయిన వస్తువులు ఉన్నాయో జాగ్రత్తగా చూసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డ్యామేజీ ఉన్న వంట సామగ్రిని తీసుకుని, తనిఖీ సమయంలో గుర్తిస్తే సీసీఏ నియమ నిబంధనల మేరకు సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

సామగ్రిని సరిచూసుకోవాలి



పాఠశాలలకు కేటాయించిన వంట సామగ్రి తీసుకునే సమయంలో ప్రధానోపాధ్యాయులు ఒకటికి రెండు సార్లు పరిశీలించాలి. నాసిరకం అని గుర్తించిన వెంటనే వాటిని తిరస్కరించాలి. ఒక వేళ ఉన్నతాధికారులు తనిఖీ చేసిన సమయంలో వంట సామగ్రిలో లోపాలు గుర్తిస్తే చర్యలు ఉంటాయి.

- రమేశ్, డీఈఓ

విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా

చిల్పూరు: విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలి.. ఇందుకు అందజేస్తున్న స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. రాజవరం పంచాయతీ పరిధిలోని కేజీబీవీ, చిల్పూరు తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కేజీబీవీ నిర్వహణ తీరు, సిబ్బంది హాజరుపట్టిక, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. పాఠశాల మరమ్మతు పనుల గురించి ఎస్‌ఓ ప్రశాంతి నుంచి వివరాలు తెలుసుకున్నారు. గదుల నిర్మాణం అసంపూర్తిగా ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. త్వరితగతిన పూర్తి చేయించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఇతర వసతుల గురించి అడగ్గా నీరు సరిగా రావడం లేదని, క్రీడా వస్తువులు లేవని, డిజిటల్ తరగతుల పరికరాలు రిపేరు చేయించాలని కోరారు. వేసవి సమీపిస్తున్న దృష్ట్యా భూగర్భ జలాలు అడుగంటడంతో నీరు తక్కువగా వస్తున్నదని, ఇబ్బంది అధికంగా ఉంటే ప్రత్యేక ఏర్పాట్లు చేయిస్తానని అన్నారు. అనంతరం తహసీల్ కార్యాలయంలో రికార్డుల నిర్వహణ, ధరణి పెండిగ్ దరఖాస్తులు, ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు, ధ్రువీకరణ పత్రాల జారీ వివరాలు తెలుసుకున్నారు. ఆర్డీఓ వెంకన్న, డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీఓ శంకర్‌నాయక్, డీటీ రామారావు, ఎంపీఓ మధుసూదన్, ఆర్‌ఐ వినీత్ తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

రోడ్ల విస్తరణకు ప్రతిపాదనలు సమర్పించాలి

జనగామ రూరల్: జిల్లాలో రోడ్ల విస్తరణకు ప్రతిపాదనలు సమర్పించాలని రోడ్లు, భవనాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ అన్నారు. గురువారం ఆయన హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధాని వరకు నాలుగు లేన్ల రోడ్లు, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాల వరకు డబుల్ లేన్ రోడ్ల విస్తరణకు ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఈ రోడ్ల విస్తరణకు జిల్లా స్థాయి కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా, రోడ్ల నిర్మాణ ఏజెన్సీ నుంచి ఒకరు, ఈఈ సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. వీసీలో కలెక్టర్ రిజ్వాన్ బాషా ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేతకార్మికుల స్థలానికి హద్దులు ఏర్పాటు చేయాలి

- సీపీఎం నాయకుల డిమాండ్

జనగామ రూరల్: పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు ఏకశిలా పార్కు ఎదురుగా ఉన్న చేనేత కార్మికుల నివాస స్థలానికి సంబంధించి సర్వే చేపట్టి హద్దులు నిర్ణయించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్, బూడిద గోపి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణ కమిటీ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రం 326/2, 328, 329 సర్వే నంబర్లలోని 4 ఎకరాల 30 గుంటల భూమిని జనగామ పట్టణానికి చెందిన చేనేత కార్మికులు 1994 సంవత్సరంలో కొనుగోలు చేసి ప్రభుత్వానికి అప్పగించగా.. 132 మందికి లేఔట్ ప్రకారం ప్లాన్ వేసి 120 చదరపు గజాల చొప్పున పట్టా సర్టిఫికెట్లు అందజేసిందన్నారు. ఆ స్థలం పట్టణానికి దూరంగా ఉండడం.. కనీస సౌకర్యాలు లేక పోవడం.. ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం రుణ సహాయం చేయకపోవడంతో కార్మికులు ఇళ్లు కట్టుకోలేక పోయారని చెప్పారు. ఇదే అదనుగా కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూమి హద్దులు చెరిపేసి సుమారు రెండున్నర ఎకరాలు కబ్జాచేసి అమ్ముకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ రోడ్డులోని ఎన్‌హెచ్–163 నుంచి పసరమడ్ల స్టేజీ వరకు నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు పేదల ఇళ్ల స్థలాల నుంచి పోతోందని, సర్వే చేపట్టి లేఔట్ ప్రకారంగా మొత్తం భూమికి హద్దులు నిర్ణయించాలని కోరారు. నాయకులు ఎండీ దస్తగిరి, పట్టణ కమిటీ సభ్యులు కల్యాణం లింగం తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద భూమి పత్రాలతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అర్చక, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పాలకుర్తి టౌన్: రాష్ట్రంలో దేవాదాయ ధర్మాదాయ శాఖలో పనిచేస్తున్న అర్చక, ఉద్యోగుల సమస్యలు పరిష్కారించాలని అర్చక, ఉద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డీవీఆర్.శర్మ దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యార్‌ను కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతినెలా వేతనాలు, హెల్త్ ఇన్సూరెన్స్, గ్రాట్యుటీ, పెన్షన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట అడిషనల్ కమిషనర్ కె.జ్యోతి, డీసీ కృష్ణప్రసాద్, జేఏసీ బృందం చైర్మన్ ఉపేంద్రశర్మ, కృష్ణమాచార్యులు, రవీందరాచార్యులు, సత్యనారాయణశర్మ, చక్రధర్ ఉన్నారు.



శైలజా రామయ్యార్‌తో జేఏసీ నాయకులు

కాజీపేట రైల్వే డివిజన్‌పై చిగురిస్తున్న ఆశలు

- విశాఖ కేంద్రంగా సౌత్ కోస్టు రైల్వే ఏర్పాటు
- దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ జోన్ హద్దులు

కాజీపేట రూరల్ : విశాఖపట్టణం హెడ్‌క్వార్టర్‌గా సౌత్ కోస్టు రైల్వే ఏర్పాటవుతున్న నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ జోన్ కేంద్రంగా పలు డివిజన్‌లను విడదీసి హద్దులు ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుపై ఆశలు చిగురిస్తున్నాయి. ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ జోన్ కేంద్రంగా సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, గుంతకల్, నాందేడ్ డివిజన్‌లు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర విభజన చట్టం–2014లో పేర్కొన్న విధంగా విశాఖ రైల్వే జోన్, కాజీపేట రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటుకు అప్పటి పార్లమెంట్ కమిటీ సభ్యులు తీర్మానం చేశారు. విశాఖ రైల్వేజోన్, సౌత్ కోస్టు రైల్వే ఏర్పాటుకు కేంద్రం శ్రీకారం చుట్టడంతో వాల్టేర్, విజయవాడ, గుంటూరు, గుంతకల్ రైల్వే డివిజన్‌లను సౌత్ కోస్టు రైల్వేలో విలీనం చేసేందుకు నిర్ణయించింది. అదేవిధంగా హైదరాబాద్, సికింద్రాబాద్, నాందేడ్ రైల్వే డివిజన్‌లను దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ జోన్‌తో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంతో సికింద్రాబాద్ డివిజన్ పరిధి గతంలో కొండపల్లి నుంచి ఉండగా ప్రస్తుతం ఖమ్మం వద్ద మోటమర్రి నుంచి విజయవాడ డివిజన్‌లోకి వెళ్తుంది. కృష్ణా జిల్లా జాన్‌పాడ్, విష్ణుపురం, జగ్గయ్యపేట, బీబీనగర్.. సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోకి వస్తాయి. గుంతకల్ డివిజన్ పరిధిలో ఉన్న వాడి–రాయచూర్ వరకు సికింద్రాబాద్ డివిజన్‌లోకి వస్తుంది. దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ జోన్‌ను విభజిస్తుండటంతో ఆరు డివిజన్‌లు ఉన్న దక్షిణ మధ్య రైల్వే మూడు డివిజన్‌లకు పరిమితంకానుంది. దీంతో ఎన్నో ఏళ్ల ఓరుగల్లువాసుల, రైల్వే కార్మికుల కల అయిన కాజీపేట డివిజన్ ఏర్పాటుకు బాటలు పడుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం కాజీపేట సబ్ డివిజన్ కేంద్రంగా బల్లార్షా, కరీంనగర్, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, కొండపల్లి, బీబీనగర్ వరకు కాజీపేట రైల్వే పాలన యంత్రాంగం విస్తరించి ఉంది. డివిజన్‌కు కావాల్సిన భౌగోళిక విస్తీర్ణం, సంపద, భూమి, స్టేషన్లు, రైల్వే యూనిట్లు, కార్మికులు, అడ్మినిస్ట్రేషన్, రైల్వే ట్రాక్ విస్తీర్ణం, రైళ్ల సంఖ్య, ఆదాయం, ప్రయాణికుల సంఖ్య, కార్యాలయాల సంఖ్యతో పాటు ఇతరత్రా అన్ని అర్హతలు ఉన్నాయని, కాజీపేట డివిజన్ చేస్తే రైల్వేకు పాలనా సౌలభ్యంతోపాటు ఆదాయ లాభం, అభివృద్ధి జరుగుతుందని రైల్వే కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



కాజీపేట జంక్షన్

కాజీపేట డివిజన్ కోసం పోరాటం చేయాలి

కాజీపేట డివిజన్ ఏర్పాటు కోసం మళ్లీ పోరాటం చేయాల్సి వస్తుందని రైల్వే కార్మిక నాయకులు అంటున్నారు. విశాఖ, సికింద్రాబాద్ రైల్వేజోన్ల విభజన వల్ల సికింద్రాబాద్ డివిజన్‌పై అధిక పనిభారం పడే అవకాశం ఉందని, ఈ క్రమంలో మరోసారి కాజీపేట డివిజన్ కోసం గొంతెత్తాలని, కలిసికట్టుగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అరుణాచలం గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

జనగామ: తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలం(తిరువన్నామలై) పుణ్యక్షేత్రం గిరిప్రదక్షిణకు ఆర్టీసీ జనగామ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎస్.స్వాతి తెలిపారు. గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు డిపో నుంచి ప్రత్యేక బస్సు బయలుదేరుతుందన్నారు. మొదట కాణిపాకం దర్శనం అనంతరం తమిళనాడు రాష్ట్ర వెల్లూరు గోల్డెన్ టెంపుల్(కాడ్పాడి) సందర్శన పూర్తయ్యాక బస్సు రాత్రి అరుణాచలం చేరుకుంటుందని చెప్పారు. 12వ తేదీ గిరిప్రదక్షిణ ముగిసిన తర్వాత అక్కడి నుంచి కంచికి, అనంతరం శ్రీకాళహస్తి క్షేత్రానికి, 13వ తేదీ రాత్రి 10 గంటలకు జనగామకు చేరుకుంటుందని వివరించారు. యాత్రకు వచ్చే పెద్దలకు టికెట్ రూ.4వేలు, పిల్లలకు రూ.2,500లు నిర్ణయించినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో సర్వీస్ నంబర్ 91111 ద్వారా టికెట్ బుక్ చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు 738285 2818, 9948164847, 9492483295 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పన్నులు సకాలంలో వసూలు చేయాలి

- మున్సిపల్ కమిషనర్ రవీందర్‌గౌడ్

స్టేషన్‌ఘన్‌పూర్: మున్సిపాలిటీ పరిధిలో ఇంటి, నల్లా పన్నులు సకాలంలో వసూలు చేయాలని కమిషనర్ జి.రవీందర్‌గౌడ్ అన్నారు. ఘన్‌పూర్ మున్సిపాలిటీలోని స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, ఛాగల్లు పాత గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సిబ్బందితో గురువారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. విధినిర్వహణలో గ్రామ పంచాయతీలకు, మున్సిపాలిటీకి తేడా ఉంటుందని, సిబ్బంది అప్రమత్తంగా, బాధ్యతతో పనిచేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రధానంగా పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. మొత్తం 18 వార్డులు ఉండగా.. 2 వార్డులకు ఒకరి చొప్పున నియమిస్తామని, ఎవరికి కేటాయించిన వార్డుల్లో టార్గెట్‌ల ప్రకారం పన్నులు వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో అకౌంటెంట్ నితిన్, కార్యదర్శులు లింగయ్య, సత్యనారాయణ, శ్రీకాంత్, శ్రీనివాస్, నర్సింహులు, మంజుల, రాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ రవీందర్‌గౌడ్

పట్టణంలో ముమ్మర తనిఖీలు

జనగామ రూరల్: పట్టణంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్, పాన్ షాపుల్లో డ్రగ్స్, కంట్రోల్ టీంతో కలిసి ఎస్సై రాజేశ్ గురువారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. రద్దీగా ఉండే బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.



బస్టాండ్‌లో తనిఖీ చేస్తున్న డ్రగ్స్, కంట్రోల్ టీం



రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

30 రైళ్ల రద్దు.. 9 దారి మళ్లింపు

- నాలుగు రీ-షెడ్యూల్

కాజీపేట రూరల్ : కాజీపేట-విజయవాడ మధ్య నాన్ ఇంటర్‌లాకింగ్ వర్క్ బ్లాక్‌తో కాజీపేట జంక్షన్ నుంచి వెళ్లే పుష్‌పుల్ ప్యాసింజర్లు, కాజీపేట, వరంగల్ మీదుగా ప్రయాణించే పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు చేసి నడిపించనున్నట్లు రైల్వే అధికారులు గురువారం తెలిపారు. ఫిబ్రవరి 10వ తేదీ నుంచి రైళ్ల రద్దు, దారి మళ్లింపు చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు.

రద్దయిన రైళ్ల వివరాలు..

ఫిబ్రవరి 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు కాజీపేట-డోర్నకల్ (67765) పుష్‌పుల్, డోర్నకల్-కాజీపేట (67766) పుష్‌పుల్, డోర్నకల్-విజయవాడ (67767) పుష్‌పుల్, విజయవాడ-డోర్నకల్ (67768) పుష్‌పుల్, విజయవాడ-భద్రాచలం (67215) సింగరేణి ప్యాసింజర్, భద్రాచలం-విజయవాడ(67216) సింగరేణి ప్యాసింజర్, గుంటూరు-సికింద్రాబాద్ (17201) ఎక్స్‌ప్రెస్, ఫిబ్రవరి 11 నుంచి 21వ తేదీ వరకు సికింద్రాబాద్-గుంటూరు (17202) ఎక్స్‌ప్రెస్, ఫిబ్రవరి 11 నుంచి 21వ తేదీ వరకు సిర్పూర్‌కాగజ్‌నగర్-సికింద్రాబాద్ (17234) ఎక్స్‌ప్రెస్, ఫిబ్రవరి 10,11,15,18,19,20వ తేదీల్లో గుంటూరు-సికింద్రాబాద్ (12705) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-గుంటూరు (12706) ఎక్స్‌ప్రెస్, ఫిబ్రవరి 11,14,16,18,19,20వ తేదీల్లో విజయవాడ-సికింద్రాబాద్(12713) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-విజయవాడ (12714) ఎక్స్‌ప్రెస్, ఫిబ్రవరి 10 నుంచి 20వ తేదీ వరకు విశాఖపట్నం-ఎల్‌టీటీ ముంబాయి (18519) ఎక్స్‌ప్రెస్, ఫిబ్రవరి 12 నుంచి 22వ తేదీ వరకు ఎల్‌టీటీ ముంబాయి-విశాఖపట్నం (18520) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 20న సాయినగర్ షిర్డీ-కాకినాడ పోర్టు (17205) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 19న కాకినాడ పోర్టు-సాయినగర్‌షిర్డీ (17206) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 19, సాయినగర్ షిర్డీ-మచిలీపట్నం (17207) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 18న మచిలీపట్నం-సాయినగర్‌షిర్డీ (17208) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకు టాటా-యశ్వంత్‌పూర్ ।(18111) ఎక్స్‌ప్రెస్, ఈనెల 9 నుంచి 16వ తేదీ వరకు యశ్వంత్‌పూర్-టాటా (18112) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు కొచ్చివెల్లి-కోర్బా (22648) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు కోర్బా-కొచ్చివెల్లి (22647) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు గోరఖ్‌పూర్-కొచ్చివెల్లి (12511) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 18,19న కొచ్చివెల్లి-గోరఖ్‌పూర్ (12512) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు హిసర్-తిరుపతి (04717) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు తిరుపతి-హిసర్ (04718) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 10 నుంచి 17 వరకు బెంగళూరు-దానాపూర్ (06509) ఎక్స్‌ప్రెస్, దానాపూర్-బెంగళూరు (06510) ఎక్స్‌ప్రెస్‌లు రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

దారి మళ్లింపు..

ఈ నెల 10,11,14,15,17,18,19,20వ తేదీల్లో కాజీపేట, వరంగల్ మీదుగా వెళ్లే 9 రైళ్లను వయా విజయవాడ, గుంటూరు, సికింద్రాబాద్‌కు దారి మళ్లించినట్లు తెలిపారు. అదేవిధంగా నాలుగు రైళ్లను రీషెడ్యూల్ చేసి నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

16న చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఓపెన్ టు ఆల్ చదరంగ పోటీలు ఈ నెల 16వ తేదీన నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్నా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు వెంట చెస్ బోర్డు తెచ్చుకోవాలని సూచించారు. క్రీడాకారులు పేర్లు నమోదు, ఇతర వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

లారీ డ్రైవర్, క్లీనర్లపై ఫైనాన్స్ నిర్వాహకుల దాడి

వరంగల్/ఖిలా వరంగల్ : లారీ డ్రైవర్ అబ్బాస్‌ఖాన్, క్లీనర్ వసీంఖాన్ పై దాడి చేసిన ఫైనాన్స్ నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు. ఫైనాన్స్ బకాయిలు ఉన్నాయంటూ బుధవారం రాత్రి పది మంది యువకులు లేబర్ కాలనీ నుంచి ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ మార్గంలో ఆగి ఉన్న లారీ డ్రైవర్ అబ్బాస్‌ఖాన్, క్లీనర్ వసీంఖాన్ పై దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. దాడిలో క్లీనర్ వసీంఖాన్ కాలు నుజ్జునుజ్జయిందన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఫైనాన్సర్ల వేధింపుల నుంచి రక్షించండి

లారీ యజమానులపై ఫైనాన్స్ ఏజెంట్ల ఆగడాలు, కలెక్షన్ ఏజెన్సీల పేరుతో ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల దాడులనుంచి రక్షణ కల్పించాలని 'ది వరంగల్ జిల్లా లారీ అసోసియేషన్' అధ్యక్షుడు వేముల భూపాల్ కోరారు. ఫైనాన్స్ కట్టలేదన్న నెపంతో అబ్బాస్‌ఖాన్, క్లీనర్ వసీంఖాన్‌లపై దాడి చేయడాన్ని ఖండించారు. బాధితులకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



సోలార్ సొబగులు..

'పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన'లో జిల్లాకు ఒక మోడల్ సోలార్ విలేజ్ ఎంపిక

- కనీసం 5 వేల జనాభా కలిగిన రెవెన్యూ గ్రామమై ఉండాలి
- జిల్లాకు ఒక సంపూర్ణ సౌరశక్తి ఉత్పత్తి గ్రామంగా తీర్చిదిద్దనున్న ప్రభుత్వం
- గ్రామానికి రూ.కోటి నిధులు అందించనున్న కేంద్రం
- టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో 8 జిల్లాల్లో 13 గ్రామాలు, ఒక మండలం ఎంపిక
- ఎంపిక చేసిన గ్రామాల్లో కొనసాగుతున్న సర్వే



హన్మకొండ: గ్రామీణ ప్రాంతాల్లో సౌర శక్తి లభ్యతను సులభతరం చేయడం, ప్రోత్సహించడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా సంపూర్ణ సౌరశక్తి గ్రామాలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ముందు ప్రతి జిల్లాలో ఒక గ్రామాన్ని మోడల్‌గా తీర్చిదిద్దనున్నారు. దీంతో ఆ గ్రామంలో సోలార్ వెలుగులు విరజిమ్మనున్నాయి. కేంద్ర ప్రభుత్వం నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ ద్వారా, రాష్ట్రంలో రెడ్‌కో, విద్యుత్ పంపిణీ సంస్థలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. ప్రతి జిల్లాకు ఒక గ్రామాన్ని ఎంపిక చేసి సంపూర్ణ సౌర విద్యుత్ ఉత్పత్తి గ్రామంగా తీర్చిదిద్దనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన గ్రామాన్ని సౌరశక్తి గ్రామంగా తీర్చిదిద్దేందుకు రూ.కోటి సాయం అందిస్తుంది. దీంతో గ్రామాలు తమ విద్యుత్ అవసరాలు తీర్చుకోవడంలో మరింత స్వయం సమృద్ధి సాధించడానికి ఈ పథకం దోహదపడుతుంది. స్థానికంగా ఉత్పత్తి చేయడం ద్వారా గ్రామీణవాసులు విద్యుత్ వినియోగ ఖర్చులను తగ్గించుకోగలుగుతారు. ప్రతి ఇంటిలో తమ ప్రతి అవసరానికి సౌరశక్తిని వినియోగించుకుంటారు. ముందు మోడల్ గ్రామంగా తీర్చిదిద్దడం ద్వారా ఇతర గ్రామాల ప్రజలను సౌర విద్యుత్ ఉత్పత్తి వైపు ప్రోత్సహించనున్నారు.

8 జిల్లాల్లో గ్రామాల ఎంపిక..

సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించడం, సమాజం తమ ఇంధన అవసరాలను తీర్చుకోవడంలో స్వావలంబన పొందేలా చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మోడల్ సోలార్ విలేజ్ అనే పథకాన్ని అమలు చేస్తుంది. ఈ పథకం అమలుకు 5 వేల జనాభా కలిగి ఉన్న రెవెన్యూ గ్రామమై ఉండాలి. రాష్ట్రంలోని టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో 17 జిల్లాలుండగా ఇప్పటి వరకు 8 జిల్లాల్లో గ్రామాల ఎంపిక జరిగింది. హనుమకొండ జిల్లాలో రెండు గ్రామాలు కేశవాపూర్, ఆత్మకూరు, వరంగల్‌లో పోతిరెడ్డిపల్లి, ఆదిలాబాద్ జిల్లాలో నర్సాపూర్, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో గండుగలపల్లి, భూపాలపల్లి జిల్లాలో జగన్నపేట, కరీంనగర్ జిల్లాలో రేకొండ, మంచిర్యాల జిల్లాలో వెంకట్రావుపేట, ఖమ్మం జిల్లాలో నాలుగు గ్రామాలతో పాటు ఒక మండలాన్ని ఎంపిక చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో ఖమ్మంలో బోనకల్‌ను సంపూర్ణ సౌర విద్యుత్ ఉత్పత్తి మండలంగా ఎంపిక చేశారు. ఈ మండలంలో 22 గ్రామ పంచాయతీలున్నాయి. వీటితో పాటు సిరిపురం, రఘునాథపాలెం, సీహెచ్ మాదారం, శ్రీరామగిరి గ్రామాలను మోడల్ సోలార్ విలేజ్‌లుగా ఎంపిక చేశారు. మరో 9 జిల్లాల్లో గ్రామాల్లో ఎంపిక చేయాల్సి ఉండగా ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

క్షేత్ర స్థాయిలో సర్వే..

మోడల్ గ్రామాల్లో ఎన్పీడీసీఎల్ అధికారులు, ఉద్యోగులు క్షేత్ర స్థాయిలో సర్వే చేస్తున్నారు. ఆ గ్రామాల్లో మొత్తం ఎన్ని విద్యుత్ సర్వీస్‌లున్నాయి.. గృహ, వ్యవసాయ, ఇతర విద్యుత్ సర్వీస్‌లతో పాటు ఒక్కొక్కటిపై ఎన్ని కిలో వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలో అంచనా వేస్తున్నారు. దీంతో వ్యవసాయ పంపుసెట్లకు ఎంత మేరకు సౌర శక్తి అవసరం, ఎంత మేరకు ఉత్పత్తి చేయొచ్చు అనే అంశాలను అధ్యయనం చేస్తున్నారు. ప్రతి ఇంటిని సోలార్ విద్యుదీకరణ చేయనున్నారు. ఈ మేరకు ఎంత సామర్థ్యం కలిగిన ప్లాంట్ ఏర్పాటు చేయాల్సి వస్తుందో డేటా సేకరిస్తున్నారు. ప్రతి ఇంటి నుంచి ప్రత్యేక ఫామ్‌లో డేటా సేకరించి సూర్యఘర్ పోర్టల్‌లో నిక్షిప్తం చేస్తారు. ఒక్కో ఇంటికి సౌర ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా ఎంత విద్యుత్ ఉత్పత్తి లభ్యత ఉంటుందనే అంశాలను సర్వేలో అధ్యయనం చేస్తున్నారు. సౌర విద్యుత్ ప్లాంట్ 12 సంవత్సరాల పని చేస్తుంది. సర్వేతో పాటు అధికారులు సౌర విద్యుత్ ఉత్పత్తి, వినియోగంపై కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తున్నారు.

గడువులోగా లక్ష్యం సాధించాలి

- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు


మాట్లాడుతున్న వరంగల్ డీసీసీబీ చైర్మన్ రవీందర్ రావు

హన్మకొండ: గడువులోగా లక్ష్యం సాధించాలని వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు , టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ ఆదేశించారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బ్రాంచ్‌ల వారీగా, ప్రధాన కార్యాలయంలో విభాగాల వారీగా ప్రగతి సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు పనితీరు మెరుగుపరుచుకోని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డీసీసీబీ సీఈఓకు సూచించారు. మాఫీ పొందిన రైతులకు పంట రుణాలు త్వరితగతిన ఇవ్వాలన్నారు. సాంకేతిక కారణాలతో పంట రుణమాఫీ కాని రైతుల ఖాతాలు మెరుగు పరిచి వారికి మాఫీ లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. నిబంధనల మేరకు 2025 సంవత్సరానికి గాను నిరార్థక రుణాలుగా వర్గీకరించిన మొండి బకాయిలను 2 శాతానికి మించకుండా రికవరీ చేయాలని మేనేజర్లను ఆదేశించారు. నిరార్థక ఆస్తులు 2 శాతానికి లోబడి ఉండేలా టర్నోవర్ రూ.2,500 కోట్లకు చేరుకునేలా కృషి చేయాలన్నారు. రిజర్వు బ్యాంకు, నాబార్డు ఆదేశాలు పాటిస్తూ డీసీసీబీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో డీసీసీబీ సీఈఓ వజీర్ సుల్తాన్, డీజీఎం అశోక్, ఏజీఎంలు మధు, గొట్టం స్రవంతి, బోడ రాజు, గంప స్రవంతి, కృష్ణ మోహన్, డీఆర్ ఓఎస్డీ విజయ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సీఐ సీతారెడ్డిపై కేసు నమోదు

వరంగల్ లీగల్: న్యాయవాదుల పోరాటానికి ఫలితంగా ఎట్టకేలకు హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డిపై హనుమకొండ పీఎస్‌లో కేసు నమోదు అయ్యింది. ఇటీవల కేయూ కూడలిలో న్యాయవాది శివపై చెయ్యి చేసుకున్న విషయం తెలిసిందే. ఈఘటనపై న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించి నిరసనలు వ్యక్తం చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేస్తామని అన్ని జిల్లాల్లోని న్యాయవాద సంఘాలు సంఘీభావం ప్రకటించాయి. ఈవిషయాలతో ఇరు వర్గాల మధ్య రాజీ కుదుర్చాలని ప్రయత్నాలు చేసినా న్యాయవాదులు అంగీకరించలేదు. దీంతో బుధవారం రాత్రి సీఐతో పాటు మరి కొంత మంది పోలీసులపై దాడి, బెదిరించిన నేరాల కింద కేసు నమోదు చేశారు. అయినా న్యాయవాదులు విధుల బహిష్కరించారు. సదరు సీఐని సస్పెండ్ చేయాలని పట్టుబట్టారు. వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయవాదుల సంఘాల ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో సీఐని సస్పెండ్ చేయడంతో పాటు భవిష్యత్‌లో ఏ ఒక్క న్యాయవాదిపై పోలీసులు దురుసుగా ప్రవర్తించకుండా చర్యలు తీసుకోవాలని తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో సంఘాల అధ్యక్షులు తీగల జీవన్ గౌడ్, మాతంగి రమేశ్‌బాబు, బడే రమేశ్, ముదసిర్ అహ్మద్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మరిపెడలో రాష్ట్రస్థాయి బంజార కల్చరల్ మీట్


సమ్మేళనంలో అధికారులు, విద్యార్థులు


తీజ్ ఉత్సవాన్ని ప్రదర్శిస్తున్న అధికారులు

- ఆకట్టుకున్న సంప్రదాయ దుస్తుల స్టాళ్లు
- అలరించిన విద్యార్థుల నృత్యాలు

మరిపెడ: మండల కేంద్రంలోని ఆడిటోరియంలో జిల్లా సమగ్ర విద్యాశాఖ, స్థానిక సీతారాంపురం జెడ్పీహెచ్‌ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 5న ప్రారంభమైన రాష్ట్రస్థాయి బంజార కల్చరల్ మీట్ రెండు రోజు గురువారం కూడా కొనసాగింది. రెండో రోజు కార్యక్రమానికి స్టేట్ జెండర్ కోర్డినేటర్ హజారీ శిరీష ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 18 పాఠశాలల బంజార విద్యార్థులు, ఉపాధ్యాయులు, వివిధ రంగాలకు చెందిన గిరిజన అధికారులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బంజార దుస్తులు, అల్లికలు, కుట్లు, ఆహారపు అలవాట్ల స్టాళ్లు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు నత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా స్టేట్ జెండర్ కోర్డినేటర్ హజారి శిరీష మాట్లాడుతూ బంజారాలు ప్రకృతితో మమేకమై జీవిస్తారన్నారు. పంట పొలాలు, పశు సంపదను ప్రేమగా చూసుకుంటారన్నారు. అనంతరం పోటీల్లో పాల్గొన వారికి బహుమతులు ప్రదానం చేశారు. రామచంద్రు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా జెండర్ కోర్డినేటర్ గుండ్ల విజయకుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవీందర్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, తహసీల్దార్ సైదులు, ఎంఈఓ జి.అనితాదేవి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయుల, విద్యార్థులు పాల్గొన్నారు.

నా అనుమతి లేకుండా .. మరో టీచర్‌తో ఎలా మాట్లాడుతారు..

- విద్యార్థినులను చితకబాదిన వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి
- గురుకుల పాఠశాలలో ఘటన
- తల్లిదండ్రుల ఆందోళన

పాలకుర్తి టౌన్ : మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఓ ఉపాధ్యాయురాలు విద్యార్థినులను చితక బాదింది. తన అనుమతి లేకుండా మరో టీచర్‌తో ఎలా మాట్లాడుతారని కొట్టింది. తొమ్మిదో తరగతి చదువుతున్న బాధిత విద్యార్థులు సిరి, శ్రావ్య, సిరి, సిరిచందన, ఆశ్విత తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సదరు విద్యార్థినులు బుధవారం రాత్రి స్టడీ అవర్‌లో ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలు కృష్ణవేణితో మాట్లాడుతున్నారు. ఇది గమనించిన మరో ఉపాధ్యాయురాలు (వైస్ ప్రిన్సిపాల్) రమాదేవి.. తన అనుమతి లేకుండా ఇంగ్లిష్ టీచర్‌తో ఎలా మాట్లాడుతారని, తరగతి గదికి వెళ్లకుండా బయటకు ఎందుకు వచ్చారని కర్రతో విద్యార్థినుల చేతులపై కొట్టింది. చేతులపై ఏర్పడిన గాయాలను విద్యార్థునులను ఫొటోలు తీసి తల్లిదండ్రులకు పంపించడంతో వారు పాఠశాలకు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్వరూప, టీచర్లతో గొడవకు దిగారు. టీచర్ల మధ్య ఉన్న గొడవలతో తమ పిల్లలను కొట్టడం సరికాదని పరకాలకు చెందిన చిర్ర ఎల్లయ్య, సురేశ్, దేవరుప్పలకు చెందిన జోగు ఇందిరమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు.


గాయాలను చూపుతున్న విద్యార్థినులు

కురవి నుంచి చిత్ర సీమలోకి..

'తండేల్' సినిమాకు అసోసియేట్ డైరెక్టర్‌గా కురవి శ్రీనాథ్


హీరోయిన్ సాయిపల్లవికి సీన్ వివరిస్తున్న శ్రీనాథ్


హీరో నాగచైతన్యతో శ్రీనాథ్

కురవి: అతడికి చిన్నప్పటి నుంచి సినిమా అంటే పిచ్చి. ఎలాగైనా చిత్రసీమలో అడుగుపెట్టాలని లక్ష్యం పెట్టుకున్నాడు. దీనికి ఒకపక్క చదువుకుంటూనే.. మరోపక్క షార్ట్ ఫిలిమ్స్ తీయడం మొదలు పెట్టాడు. ఇంకొవైపు సినిమా అవకాశాల కోసం వెతికాడు. ఈ ప్రయత్నంలో తన ప్రతిభకు పదునుపెట్టాడు. వచ్చిన అవకాశాలను ఒడిసిపట్టాడు. చివరకు అందమైన రంగుల ప్రపంచం(సినీరంగం)లోకి అడుగుపెట్టి తన ప్రతిభ చాటుకున్నాడు. పెద్ద హీరో, హీరోయిన్లు నాగచైతన్య, సాయిపల్లవి నటించిన 'తండేల్' చిత్రానికి అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేసి తన లక్ష్యం నెరవేర్చుకున్నాడు. అతడే మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రానికి చెందిన కోదుమూరి శ్రీనాథ్(కురవి శ్రీనాథ్). శ్రీనాథ్ అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన సినిమా 'తండేల్' దేశవ్యాప్తంగా నేడు(శుక్రవారం) విడుదల కానుంది.

ఊరిపేరు ఇంటి పేరుగా మార్చుకుని..

కురవి మండల కేంద్రానికి చెందిన కోదుమూరి వెంకటేశ్వర్లు, నాగమణి(నాగ) దంపతుల చిన్న కుమారుడు శ్రీనాథ్‌కు చిన్నప్పటి నుంచి సినిమాలపై మక్కువ. ఈ రంగంలో ఎదగాలని నిర్ణయించుకున్నాడు. అనుకున్నదే తడువుగా షార్ట్‌ఫిలిమ్స్ తీయడం మొదలుపెట్టాడు. అలాగే, అభిషేకం సీరియల్‌కు అసోసియేట్ డైరెక్టర్ వ్యవరించాడు. ఈ క్రమంలో తెలిసిన వ్యక్తుల ద్వారా టెక్నీషియన్‌గా పలు సినిమాలకు పని చేశాడు. ఇందులో నందమూరి కల్యాణ్‌రామ్ సినిమా 'డెవిల్'కు అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేశాడు. ప్రస్తుతం పెద్ద సినిమా 'తండేల్'కు అసోసియేట్ డైరెక్టర్‌గా అవకాశం వచ్చింది. నేడు ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో కురవి గ్రామంతోపాటు మహబూబాబాద్ జిల్లా ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సినిమా విజయం సాధించి కురవి కుర్రోడు మరింత ఎదగాలని వారు ఆశీర్వదిస్తున్నారు. కాగా, తన పేరుతోపాటు తన ఊరి పేరు కూడా వెండితెరపై కనపడాలనే ఆకాంక్షతో తన పేరు కురవి శ్రీనాథ్‌గా మార్చుకున్నాడు.

డిమాండ్ల సాధనకు అవసరమైతే మెరుపు సమ్మె

- ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ స్పష్టీకరణ


సమావేశంలో నాయకులు

హన్మకొండ: డిమాండ్ల సాధనకు అవసరమైతే మెరుపు సమ్మె చేపడుతామని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ కిశోర్ రావు, కన్వీనర్ వజీర్ అన్నారు. విద్యుత్ ఆర్టిజన్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ చేపట్టిన యాత్ర గురువారం హనుమకొండకు చేరుకుంది. ఈ సందర్భంగా హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో జేఏసీ నాయకులు మాట్లాడుతూ తమ జీవితమంతా విద్యుత్ సంస్థలకు సేవ చేయడంలోనే గడిచిపోతోందని, అయినా తమకు కల్పించాల్సిన హక్కులు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నా తమకు దక్కాల్సిన ప్రయోజనాలు అందడం లేదన్నారు. విద్యార్హతను బట్టి ఆర్టిజన్ కార్మికులను విద్యుత్ సంస్థల్లో రెగ్యులర్ ఉద్యోగులుగా నియమించాలని, అర్హతను బట్టి పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ వరంగల్ జిల్లా కన్వీనర్ కందికొండ వెంకటేశ్వర్లు, నాయకులు బండారి ఐలయ్య, వెన్నమల్ల నరేందర్ సదానందం, చంద్రారెడ్డి, రఘునాథ రెడ్డి, ఓదెలు, కోటి, సురేశ్ రెడ్డి, శ్రీనాథ్, రాజేందర్, జయచందర్ శ్రీకాంత్ సృజన, కల్యాణి, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

సీయూఈటీ ద్వారా పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

- నిట్ ప్రొఫెసర్ కాశీనాథ్


మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీనాథ్

విద్యారణ్యపురి: కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్ (సీయూఈటీ) పరీక్ష ద్వారా దేశంలోని సెంట్రల్ యూనివర్సిటీలు, మరికొన్ని స్టేట్ యూనివర్సిటీల్లోనూ పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందొచ్చని నిట్ వరంగల్ ప్రొఫెసర్ కాశీనాథ్ తెలిపారు. గురువారం హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో సెంట్రల్ యూనివర్సిటీలు, డీమ్డ్ యూనివర్సిటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ప్రధానంగా సీయూఈటీ పరీక్ష విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కేడీసీ కెమిస్ట్రీ విభాగం అధిపతి వాసం శ్రీనివాస్ మాట్లాడుతూ సీయూఈటీ, పీజీసెట్ కోసం కేడీసీలోని కెమిస్ట్రీ విభాగంలో త్వరలోనే 40 రోజులు ఉచిత కోచింగ్ ఇవ్వబోతున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనాథ్, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్యాంప్రసాద్, అధ్యాపకులు డాక్టర్ విజయలక్ష్మి, ఎడమ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్‌సంధ్యారాణి, డాక్టర్ వీరన్న, డాక్టర్ ప్రసూన పాల్గొన్నారు.

కుంభాభిషేకానికి వేళాయె..


ఆలయాల గోపురాలు, ఆలయాలపై మెట్ల మార్గం


కలశాల పూజకు సిద్ధం చేస్తున్న రుత్వికులు

నేటినుంచి 9వ తేదీ వరకు మహాకుంభాభిషేక పూజలు

- 9న సచ్చిదానంద సరస్వతితో నిర్వహణ
- అచ్చలాపురం రుత్వికులతో 1,180 కలశాలకు పూజ నిర్వహణ
- భక్తులకు అన్నదానం, ఉచిత ప్రసాదానికి ఏర్పాట్లు
- సర్వం సిద్ధం చేసిన దేవాదాయశాఖ అధికారులు
- మూడు రోజులు కాళేశ్వరంలో ఆధ్యాత్మిక సందడి

కాళేశ్వరం: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన మహా ఘట్టం రానే వచ్చింది. 42ఏళ్ల అనంతరం మహాకుంభాభిషేకం నిర్వహణ ఏర్పాట్లను రాష్ట్రంలోనే మొదటిసారి కాళేశ్వరం దేవస్థానంలో నిర్వహించడానికి రాష్ట్ర దేవాదాయశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఆలయంతో పాటు గోదావరి నది వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. నేటి (శుక్రవారం) నుంచి 9వ తేదీ (ఆదివారం) వరకు కాళేశ్వరం దేవస్థానంలో శృంగేరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతితీర్థస్వామి వారి ఆశీస్సులతో తుని తపోవనం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సచ్చిదానందసరస్వతితో మహాకుంభాభిషేకం నిర్వహణ చేయనున్నారు. ముఖ్యంగా శత చండి, మహారుద్ర సహిత సహస్ర ఘటాభిషేకం, కుంభాభిషేక మహోత్సవాన్ని ఆసిఫాబాద్ జిల్లా అచ్చలాపురం దుద్దిళ్ల మనోహరశర్మ ఆధ్వర్యంలో శిష్య బృందం 50మంది రుత్వికులతో నిర్వహిస్తారు. 1,180 కలశాలతో పూజా కార్యక్రమం నిర్వహించనున్నారు.

మూడు రోజులు ఆధ్యాత్మిక శోభ..

కాళేశ్వరంలో మూడు రోజుల పాటు తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. 42ఏళ్ల తరువాత నిర్వహిస్తుండడంతో తిలకించడానికి భక్తులు తరలిరానుండడంతో అధికారులు ఏర్పాట్లు చేశారు. దీంతో కాళేశ్వరంతో పాటు ఆలయ పరిసరాలన్నీ ఆధ్యాత్మికశోభతో వెలుగొందనున్నాయి. ఉచితంగా పులిహోర ప్రసాదం, అన్నదానం కార్యక్రమం చేస్తారు. ఇప్పటికే గోపురాలు, ఆలయాలకు పరంజాలతో మెట్ల మార్గాలు పూర్తిచేశారు. ఒక్కో గోపురం, ఆలయాల వద్ద 10నుంచి 12మంది వరకు సామర్థ్యంతో నిర్మాణం చేశారు. ఈ అపురూప ఘట్టాన్ని తిలకించడానికి సుమారు 50వేలకుపైగా భక్తజనం రానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆదివారం 10.42గంటలకు ముహూర్తం..

ఆదివారం (9న) 10.42గంటలకు ముహూర్తం ప్రకారం శ్రీశ్రీశ్రీ సచ్చిదానందసరస్వతితో ప్రధాన ఆలయంపై గోపురం వద్ద ఆయన మహాకుంభాభిషేకం పూజ, ఇతర రుత్వికులు మిగతా గోపురాలు, ఆలయాల వద్ద సంప్రోక్షణ చేస్తారు. కుంభాభిషేకం పూజ వీక్షణకు నాలుగు ఎల్‌ఈడీ తెరలను ఏర్పాటు చేస్తున్నారు. మహాకుంభాభిషేకం తరువాత భక్తులను దర్శనాలకు అనుమతి ఇవ్వనున్నారు. కానీ వచ్చే భక్తజనం రద్దీతో గర్భగుడిలోకి ప్రవేశించడానికి అనుమతి లేదని అధికారులు పేర్కొంటున్నారు.

మూడు రోజులు పూజల వివరాలు

7న శుక్రవారం

ఉదయం ఆరు గంటలకు మేళతాళాలు, వేద మంత్రాలతో వేద పండితులతో కలిసి త్రివేణి సంగమం వద్దకు వెళ్లి ఐదు కలశలాతో పవిత్ర గోదావరి జలాలు తీసుకువస్తారు. ఆ కలశాల జలాలను 1,180 కలశాలతో కలిపి పూజ చేస్తారు. 7.30గంటలకు గోపూజ, గణపతి పూజతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం 12.30గంటలకు మహా నివేదన అనంతరం ఉచిత పులిహోర ప్రసాదం, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం 3.30గంటల నుంచి సాయంత్రం 6.30గంటల వరకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తారు. రాత్రి 7గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. కూచిపూడి నృత్యం, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

8న శనివారం

ఉదయం 8.30 గంటలకు ప్రాతఃకాల పూజలు, శ్రీశుభానందాదేవి అమ్మవారి ఆలయంలో చండీ పారాయణం, అనివెట్టి మండపంలో సహస్ర ఘటాభిషేకం, మధ్యాహ్నం 12.30గంటలకు మహా నివేదన తరువాత ఉచిత ప్రసాదం , అన్నదానం నిర్వహిస్తారు. 3.30 నుంచి శత చండీ హోమం నిర్వహిస్తారు. రాత్రి 7గంటలకు మంగళంపల్లి వేణుగోపాల శర్మతో ప్రవచనాలు చేస్తారు. రాత్రి 8గంటల నుంచి కూచిపూడి నృత్యం ఉంటుంది.

9న ఆదివారం

ఉదయం7.30 గంటల నుంచి ప్రాతఃకాల పూజ, రుద్ర హోమం, బలి ప్రధానం చేస్తారు. 10గంటలకు మహా పూర్ణాహుతి చేస్తారు.10.42 గంటలకు మహాకుంభాభిషేకం కార్యక్రమం ఉంటుంది. 11 గంటలకు పీఠాధిపతులతో అనుగ్రహ భాషణం చేస్తారు. 11.20 గంటలకు బాచంపల్లి సంతోశ్ కుమార్ శాస్త్రి ప్రవచనం కార్యక్రమం వినిపిస్తారు. మధ్యాహ్నం 12గంటలకు దాతలకు ఆశీర్వచనం, కలశాల వితరణ చేస్తారు. 12.30గంటలకు మహా నివేదన అనంతరం ఉచిత ప్రసాదం, అన్నదానం కార్యక్రమాన్ని ప్రత్యేక కౌంటర్ల ద్వారా జరుపుతారు.